బొండా.. కేరాఫ్ తూర్పు

నేటికీ తూర్పు నియోజకవర్గంలోనే బొండా ఉమా నివాసం

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి పక్కా లోకల్
- పదేళ్ల క్రితం నుంచే లోటస్‌లో నివాసం
- ప్రజలను పక్కదారి పట్టించేందుకే స్థానికతపై బొండా విమర్శలు



తూర్పు నియోజకవర్గం మొఘల్రాజపురంలోని బొండా ఉమా ఇల్లు(ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా ఏ మీటింగ్‌లో ప్రసంగించినా... ఏ మీడియా సమావేశంలో మాట్లాడినా 'వెలంపల్లి శ్రీనివాస్ పక్క నియోజకవర్గం వారు.. వేరే నియోజకవర్గం వాళ్లు వచ్చి ఓట్లడిగితే ప్రజలు వేస్తారా.. నమ్ముతారా?' అంటూ మైకుల ముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే అక్కడ సీన్ కట్‌చేసి వాస్తవాల్లోకి వెళ్తే అసలు పక్క నియోజకవర్గంలో ఉంటుంది ఈ బొండా ఉమానే అనేది స్పష్టంగా కనిపిస్తుంది.

నేటికీ 'తూర్పు' వాస్తవ్యుడే..

తాను ఎమ్మెల్యేగా కాకముందు నుంచి అంటే గత పదిహేనేళ్ల క్రితం నుంచి బొండా ఉమా తూర్పు నియోజకవర్గంలోని మొగల్రాజపురంలోనే నివాసం ఏర్పరుచుకొని తన కుటుంబంతో కలిసి జీవిస్తున్నారు. ఇన్నేళ్లు సింగ్‌నగర్‌లోని అద్దె ఇంట్లో టీడీపీ కార్యాలయాన్ని నడిపిన ఆయన ఆ అడ్రస్‌తోనే సెంట్రల్ నియోజకవర్గంలోకి తన ఓటును మార్చుకున్నారు. నాలుగేళ్ల క్రితం ఎటువంటి అనుమతులు లేకుండా ఆందోళనలు చేస్తున్న తనను అడ్డుకోవడానికి వెళ్లిన తూర్పు నియోజకవర్గానికి చెందిన పోలీసులపై బొండా 'ఇది నా ఇల్లు.. నువ్వు నా ఇంట్లోకి వస్తావా' అంటూ ఖాకీలపై ఆయన చేసిన గూండాయిజం వీడియోలు ఆనాడు రాష్ట్ర వ్యాప్తంగా హల్‌చల్ చేశాయి. రెండేళ్ల క్రితమే బొండా ఉమా సింగ్‌నగర్ స్మైల్ హాస్పిటల్ సమీపంలో తన పేరుమీద ఓ స్థలాన్ని కొనుగోలు చేసి అందులో పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారు. నేటికి నియోజకవర్గంలో ఏ కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు హాజరుకావాలన్నా తూర్పు నియోజకవర్గంలోని తమ ఇంటి నుంచే బొండా ఉమా, ఆయన కుమారులిద్దరూ ఇక్కడకు వచ్చి వెళ్తుంటారు. ప్రస్తుతం పలు పార్టీ కార్యక్రమాలు, ప్రెస్‌మీట్‌లను కూడా బొండా ఉమా తూర్పు నియోజకవర్గంలోని తన నివాసంలోనే నిర్వహిస్తున్నారు.

పదేళ్ల క్రితమే లోటస్‌లోకి..

పశ్చిమ ఎమ్మెల్యేగా రెండు మార్లు పనిచేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పదేళ్ల క్రితమే సెంట్రల్ నియోజకవర్గంలోని లోటస్‌లో ఇల్లు తీసుకొని నివాసమున్నారు. ఆయన రాజకీయాల్లోకి రాకముందు కూడా వెలంపల్లి కుటుంబ సభ్యులకు సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వస్త్ర వ్యాపారస్తులుగానే పేరుంది. గతంలో వెలంపల్లి పితరులకు సెంట్రల్ నియోజకవర్గంలో సొంత ఆస్తులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైనప్పుడు నందమూరినగర్ మెయిన్‌రోడ్డులో వెలంపల్లి శ్రీనివాసరావు తీసుకున్న కార్యాలయం కూడా సెంట్రల్ నియోజకవర్గంలోనిదే.. ఇలా ఏ రకంగా చూసుకున్నా బొండా ఉమా కంటే వెలంపల్లి శ్రీనివాస్‌నే స్థానికుడుగా తేటతెల్లమవుతోంది. ఇదే విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా నిలదీస్తుంటే వాస్తవాలు విని తెల్లమోహం వేసుకోవడం తెలుగుతమ్ముళ్ల వంతు అవుతోంది.

క్లుప్తంగా

కరాటేతో ఆత్మస్థైర్యం



పాయకాపురం(విజయవాడరూరల్): కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యంతో పాటు శారీరక ధారుఢ్యం పెంపొందించుకొని మంచి ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంపీ, రామకృష్ణ సమితి గౌరవాధ్యక్షుడు, గోకరాజు గంగరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. జపాన్ వారి బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన పాయకాపురంలోని శారదా విద్యాలయం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు, రామకృష్ణ సమితి కరస్పాండెంట్ వి.దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ త్రిమూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

25న అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామివారి మందిరంలో మణికంఠ భక్తబృందం ఆధ్వర్యాన అయ్యప్ప స్వామివారి జయంతి మహోత్సవాలు ఈనెల 25వ తేదీ సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బల్లెం పూర్ణ గురుస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి విశేషంగా అభిషేకం, అర్చనలు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చల్లా సుధాకర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. గురువారం గవర్నర్‌పేటలోని 23వ డివిజన్ పార్టీ కార్యాలయంలో డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు(సురేష్) ఆధ్వర్యంలో సుధాకర్‌ను శాలువా కప్పి సత్కరించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు(సురేష్), వడ్డీ వాసు, విక్కీ, శ్రీను పాల్గొన్నారు.

డాక్టర్ బషీర్‌కు సర్జన్ ఆఫ్ ది డికేడ్ అవార్డు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): దశాబ్ద కాలంగా పేద, మధ్య తరగతి ప్రజలకు అధునాతన ఫేకో, లేసిక్ సర్జరీలు 35 వేలకు పైగా నిర్వహించి కంటి చూపును ప్రసాదించినందుకు గాను అయాన్ ఐ ఆస్పత్రి అధినేత డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్ సర్జన్ ఆఫ్ ది డికేడ్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రఖ్యాత గీతా విజన్ ట్రస్టు ఏప్రిల్ 7న నిర్వహించే ఉగాది పురస్కారాలు 2024లో డాక్టర్ బషీర్‌కు ఈ అవార్డును అందజేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు పొక్కులూరి సుబ్బారావు తెలిపారు. శాశ్వత అంధత్వానికి దారితీసే పరిస్థితుల్లో ఉన్న రోగులు ఎందరికో వెలుగులు నింపినట్లు తెలిపారు.

భవిత కేంద్రానికి కంప్యూటర్ల వితరణ

ఇబ్రహీంపట్నం: స్వర్ణ టోల్‌వే సంస్థ ఆధ్వర్యంలోని స్థానిక భవిత కేంద్రానికి రూ.15 లక్షల సీఎస్ఆర్ నిధులతో 15 కంప్యూటర్లు, 15 ప్రింటర్లు, 19 ట్రంపోలిన్స్ (దివ్యాంగుల పరికరాలు) గురువారం అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు కిరణ్‌బాబు, కార్యదర్శి రమణసాయి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం పొందేందుకు రూ.15 లక్షలతో ఈ పరికరాలు అందించామన్నారు.

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి



భరత్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): త్వరలో జరిగే అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి పి. భరత్‌కుమార్ ఎంపికైనట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఏషియన్ యూనివర్సిటీస్ పవర్‌లిఫ్టింగ్ కప్ చాంపియన్‌షిప్ మే ఐదు నుంచి 11వ తేదీ వరకూ హాంకాంగ్‌లో జరగనున్నట్లు పేర్కొన్నారు. అందులో భారతదేశం పక్షాన తమ కళాశాల విద్యార్థి పి. భరత్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. దానికి అయ్యే ఖర్చు సుమారు రూ.1.50 లక్షల వ్యయాన్ని కళాశాల పక్షాన భరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని విద్యార్థి భరత్‌కుమార్‌కు గురువారం కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం విద్యార్థులను అభినందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కె. రామకృష్ణ, క్రీడా విభాగాధిపతి డి. హేమచంద్రరావు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఉత్సాహంగా సాగిన ఇన్‌కెండో–2కే24



మాట్లాడుతున్న సతీష్ వర్మ



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కామర్స్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజయవాడ సెంట్రల్ సర్కిల్ ఇన్‌కమ్ ట్యాక్స్ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి. సతీష్ వర్మ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో ఇన్‌కెండో–2కే24 పేరుతో కామర్స్ చదువుతున్న విద్యార్థులకు కామర్స్ కోర్సునకు సంబంధించిన అంశాలతో పాటుగా సాంస్కృతిక అంశాల్లో పోటీలను గురువారం జరిగాయి. సతీష్ వర్మ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గొప్ప విజయాలు సాధించిన వారి జీవిత పుస్తకాలను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకతతో పాటుగా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కామర్స్ విభాగాధిపతి కె.నారాయణరావు, సిద్ధార్థ అకాడమీ సభ్యుడు లలిత్ ప్రసాద్ ప్రసంగించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు..

సభ అనంతరం జరిగిన పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిసెస్, డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో తనిఖీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులో నాకాబందీ నిర్వహించింది. ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. భానూనగర్ జంక్షన్ వద్ద రూ.12లక్షల నగదును తనిఖీలలో గుర్తించారు. దీంతో ఐటీ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందజేశారు. తాము బ్యాంకు సిబ్బంది అని బ్యాంకు పనిమీద నగదు తీసుకువెళ్తున్నట్లు వారు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి లత వారితో పాటు బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. సదరు నగదు బ్యాంకుకు సంబంధించినదేనని పత్రాలు చూపించారు. దీంతో నగదును బ్యాంకు సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారం నగదును తీసుకువెళ్లలేటప్పుడు దానికి సంబంధించిన పత్రాలు తప్పకుండా తీసుకువెళ్లాలని ఆమె సూచించారు.

సీఎంగా జగన్ మళ్లీ వస్తేనే సంక్షేమ పథకాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. మళ్లీ జగన్ వస్తేనే ఆ పథకాలన్నీ అమలవుతాయని ఆమె పేర్కొన్నారు. గడప గడపకూ మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం 8వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎలాంటి వివక్ష చూపకుండా అందరికీ పథకాలు అందించడమే కాకుండా, పెద్ద ఎత్తున అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయ కూడా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీతారాసహిత గురు వ్రతం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్థిల్లాలని లోక కల్యాణార్థం సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో గురువారం సాయంత్రం శివజ్ఞాన పీఠం ఆధ్వర్యాన శ్రీతారా సహిత గురు వ్రతం జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శివాచార్య స్వామి భక్తుల చేత వ్రతం చేయించారు.

ఈ సందర్భంగా ఆయన వ్రతం విశిష్టతను వివరించారు. ప్రజలందరికీ మంచి జరగాలని స్వామివారి ఆశీస్సులు అందాలని తాము సామూహిక శ్రీతారా సహిత గురువ్రతం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొనకళ్ల సత్యకృష్ణప్రసాద్, సుశీల దంపతులు పీఠలమీద కూర్చుని పూజలు చేశారు. పీఠం ఆర్గనైజర్ పేర్ల శ్యాంప్రసాద్, గుండు దిలీప్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమికి ఓటమి తథ్యం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



లోటస్ ల్యాండ్ మార్క్ వద్ద స్థానికులను ఓటు అభ్యర్థిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలన అందించారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 32వ డివిజన్ లోటస్ ల్యాండ్‌మార్క్ సెక్టార్ వన్‌లో గురువారం కో ఆప్షన్ సభ్యురాలు గుండే శుభాషిణి, లోటస్ అసోసియేషన్ సభ్యులతో కలిసి గడప గడపకూ వెళ్లి ప్రజలతో మమేకమయ్యి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే నీట మునిగే లోటస్ ల్యాండ్ మార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దామన్నారు.

ధైర్యంగా ప్రజల ముందుకు..

ప్రజల మనస్సులలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక కూటమి ఏర్పడిందని అయినప్పటికీ కూటమికి ఓటమి తప్పదని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోని టీడీపీ, జనసేన, బీజేపీలకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఇచ్చిన ప్రతీ హామీను అమలు చేశామని చేసిన మంచిని చూసి ఓటు వేయమని ధైర్యంగా తాము ఓటు అడుగుతున్నామని అన్నారు. నియోజకవర్గంలో బోండా ఓట్లు కోసం బెదిరిస్తున్నారని వారి బెదిరింపులకు భయపడాల్సిన పనిలేదని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షులు కొండపల్లి బుజ్జి, వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ పాల్గొన్నారు

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్



గోశాల వద్ద ఫుట్‌పాత్‌పై కాయిర్ మ్యాట్

- ఆలయ ప్రాంగణంలో కూల్‌పెయింట్
- గోశాల వద్ద కాయిర్ మ్యాట్
- త్వరలో చలువ పందిళ్ల నిర్మాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవి ఎండ నుంచి భక్తులకు ఉపశమనం కలిగేలా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు కాళ్లు కాలకుండా పలు చోట్ల కూల్ పెయింట్‌ను ఇప్పటికే వేశారు. ఘాట్‌రోడ్డులో ఓం టర్నింగ్ నుంచి చిన్న గాలి గోపురం వరకు, స్కానింగ్ పాయింట్ నుంచి మహా మండపం వరకు, ఇటు మహా మండపం లిఫ్టు నుంచి మహామండపం వరకు కూల్ పెయింట్ వేశారు. ఇక కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు గోశాల వైపున కాయర్ మ్యాట్‌ను వేసి భక్తులకు ఉపశమనం కల్పించారు. మరో వైపున ఎండ తీవ్రత ఎక్కువైనా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి ఇప్పటికే ఆలయ ప్రాంగణానికి తరలించారు. మరో మూడు, నాలుగు రోజులలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచుకోవాలి

మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమారి



చిన్నారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచుకుని తగు చికిత్స అందించటం ద్వారా డౌన్‌సిండ్రోమ్ పిల్లలు కూడా మెరుగైన జీవనం సాగించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు, చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణకుమారి అన్నారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణసంస్థ కార్యాలయంలో గురువారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినాన్ని పురస్కరించుకుని అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డౌన్ సిండ్రోమ్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలకు సహజంగా హృదయ, కాలేయం, థైరాయిడ్, ఊపిరితిత్తులు, కంటి, దంత సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం గరుడ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎస్ జె. సిద్ధార్థ, డాక్టర్ హర్షిత, పి. బాలాజీ తదితరులు చిన్నారులు వారి తల్లిదండ్రులను ఉచితంగా పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

సైన్స్ వల్లనే మనిషికి సౌకర్యాలు

- సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్
- సిద్ధార్థలో ముగిసిన ఫిజిక్స్, కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ సదస్సు



మాట్లాడుతున్న బీఎల్‌వీ ప్రసాద్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుతం మనిషి అనుభవిస్తున్న సౌకర్యాలు అన్ని సైన్స్ ప్రసాదించిన కానుకలేనని బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు గురువారం సాయంత్రంతో ముగిసింది. ఈ సదస్సులో ప్రసాద్ మాట్లాడుతూ మన నిత్య జీవితంలో ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి పని సైన్స్‌తో ముడిపడి ఉంటుందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కె.గంగూలీ మాట్లాడుతూ విదేశాల్లో మంచి విశ్వవిద్యాలయాల్లో చదువుకుని దేశానికి మంచి పేరు తీసుకు రావాలని చెప్పారు. ప్రొఫెసర్ టీవీఆర్ టాటా మాట్లాడుతూ నానో టెక్నాలజీ వల్ల మనిషి జీవనం చాలా సౌకర్యవంతంగా మారిందన్నారు. సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ప్రొఫెసర్ కేఎల్ మోహనరావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇలాంటి సదస్సు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గుంటుపల్లిలో పోలీసులు కవాతు

ఇబ్రహీంపట్నం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గుంటుపల్లి గ్రామంలో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. వెస్ట్‌జోన్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి అధ్యక్షతన సుమారు 100 మంది సివిల్, ఏఆర్, పారా మిలటరీ బలగాలతో గుంటుపల్లి సెంటర్ నుంచి ఖాజీపేట మీదుగా ఎంపీపీ పాఠశాల వరకు ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. సీఐ ఎం.సత్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తలమానికంగా 34వ డివిజన్



కేదారేశ్వరపేటలో నిర్మించిన సీసీ రోడ్డు



నాడు-నేడు కార్యక్రమం ద్వారా రూపురేఖలు మారిన లక్ష్మణదత్తు పాఠశాల



సరికొత్త లుక్లో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

స్థానిక 34వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండింటిలోనూ అగ్రభాగాన నిలుస్తూ మోడల్ డివిజన్‌గా రూపుదిద్దుకుంటోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పలు దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు కొత్త ప్రాజెక్టుల రాకతో డివిజన్ కళకళలాడుతోంది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా కేదారేశ్వరపేటలోని లక్ష్మణ దత్తు ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేయడంతో గతంలో పదుల సంఖ్యలో ఉండే విద్యార్థుల సంఖ్య నేడు వందల సంఖ్యకు చేరుకుంది. ఎర్రకట్ట నుంచి మీసాల రాజారావు బ్రిడ్జి వరకు సీసీ రోడ్డును నిర్మించడంతో పాటు ఖుద్దూస్‌నగర్ ఆరు పంపుల బావి, కేదారేశ్వరపేటలో సీసీ రోడ్లు, కేదారేశ్వరపేటలో ఉద్యానవనం వంటివి ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ)



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన పార్కు